

మంచు కరిగినవేళ మమత నవ్వింది

శ్రీమతి వేదుల శకుంతల

శ్రీకారం చుట్టుకున్న అరచేయి కళ్ల కద్దుకుని, గట్టిగ ఆవలించి లేచి కూర్చున్నారు రంగనాథం మేష్టారు. ఆయన మంచం కిటికీ ప్రక్కగ వుంటుంది. తెల్లగ తోమిన కంచు మరచెంబు దానిమీద మట్టుగ్లాసు బోర్లించి, కిటికీలో ఆయనకి అందేట్టుగ వుంటుంది. రాత్రివేళ దాహం వేస్తే చేతికి అందే మరచెంబు ఎత్తి గడగడ నీళ్లన్ని త్రాగేసి నిద్రపట్టేవరకు తలగడ క్రిందవున్న విసనకర్రతో విసురుకోవటం ఆయనకి జీర్ణించుకుపోయిన అలవాట్లు. మరీ వేసంకాలంలో తప్ప ఆయన ఆ గది వదలి బైట పడుకోరు. ఆరు బైట గాలి ఆయన తత్వానికి సరిపడదు. తనకి పరిపడని పనులు పరిపాటునైనా ఆయన చేయరు. మరొకరు చేసినా సహించరు. ఆయన సంగతి అందరికీ తెలుసు. రంగనాథం మేష్టారి పట్టుదల, శాంతం బడిలోనూ జరిగితీరాల్సిందే! అయితే అన్నీ తెలుసుండీ ఆయన ఇష్టానికి వ్యతిరేకంగ ప్రవర్తించి, ఎదురించినవాడు గర్భవాసాన్న పుట్టిన కొడుకే కావటం—ఆయనకి తీరని బాధని కల్గించింది!

మసక వెలుతురులో ఎదురింటి సీతారామమ్మ వాకిట్లో పెడుతున్న ముగ్గులు, తెల్లగ మల్లెలు వెదజల్లినట్టు, అంతకంటే అందంగ—ఆమె ప్రక్కనే నుంచున్న మనమడు రఘు బొమ్మకొంగు పట్టుకుని, ఆమె వంచినప్పుడల్లా తనూ నడుం వంచుతు నానా అవస్థపడటం—కనిపిస్తోంది. 'ఎందుకురా వెధవాయ్ వెళ్లి పడుకోరాదూ?' కసురుకున్నది సీతారామమ్మ. కొంగు లాగుతూ వుంటే చుక్కలు సరిగా కుదరటంలేదని. 'నే వెళ్లను. మరేమో మజ్జిగచేసి వెన్నంతా చట్టిలో దాచేసేవుగ నిన్న. ఇవాళ అంతా నాకు పెట్టాల్సిందే'

'ఓరి నీ అసాధ్యం గూల. అలాగే లేరా వెళ్లి మీ తాతయ్య దగ్గర పద్యాల చెప్పించుకుంటూ వుండు. అంతలో ముగ్గుల పెట్టేసివస్తాను' అరచేతిలో ముగ్గు తాలిస్తు అన్నది. 'ఉహూ...మరి తాతయ్య చుట్ట త్రాగి చెప్తానన్నాడు.' ముద్దుగ గునుస్తూ బొమ్మ పెట్తున్న ముగ్గులు త్రొక్కేస్తు వుంటే వీధి అరుగుమీదకి వచ్చిన తాతయ్య 'ఒరేయి యిలా రారా! వెధవ చుట్ట అంటుకోవటంలేదుగాని, మనం పద్యాలు చెప్పుకుందాముర' అన్నాడు అరుగుమీద చతికిల పడుతూ.

మంచంమీద బాసిన పట్టేసుకుని కూర్చున్న రంగనాథం మేష్టారికి నేత్రానందకరంగ వున్నది ఆ దృశ్యం. 'తాతయ్య మనమడు' ఈ అనుభూతి క్రొత్తగ వున్నది. మునుపెన్నడు ఎరగని పరవశం కలిగి గిలిగింతలు పెడ్తోంది. తాను ఎంతమందికి చదువులు చెప్పలేదూ, డిక్టేషన్‌లో తప్పులు రాస్తే వదేసిసార్లు రాయించటం—క్లాసులో అల్లరిచేస్తే ఇంపోజిషన్ రాసి తెమ్మనటం—పద్యాలు కంఠస్థం చేయకపోతే గోడకుర్చీలు, జవాబులు రాయకపోతే బెత్తం దెబ్బలు! ఎన్నెన్ని శిక్షలువేసి ఛార్లో పెట్టలేదూ?

ఈనాడు తనదగ్గర చదువుకున్న వాళ్ళు పెద్దపెద్ద పదవుల్లో వున్నా తనని ఎంత భయభక్తులతో చూస్తారని?... అలాంటిది స్వంతకొడుకైన వాడు తన రక్తం పంచుకుని పుట్టినవాడు ప్రసాదు తను ఇష్టపడకపోయినా తనని వదలి ప్రేమించిన అమ్మాయిని చేసుకుని వెళ్ళిపోతాడా? వాడూ ఒక కొడుకే? తల్లి ఎంత బాధపడ్డదో వాడి కళ్ళకేనకపోయాక వాడు బ్రతికినా చచ్చినా ఒకటే ననిపించింది. పరాయి పిల్లలపాటి భయభక్తులు వాడికి లేకపోతే తనేనా అంత తక్కువ? 'ఫో ఇంట్లోంచి' అనేసేడు. భార్య ఎంత గోల పెట్టిందని? కాని తను కరుగలేదు. పైగా ఏమన్నాడూ? 'ఇదిగో చూడు వాడు నిజంగ కొడుకే అయితే మనల్ని కాదని ఆ పిల్లని చేసుకుందుకు పోతాడా? ఏనాటి బాకీయెూ అనుకో. వీళ్ళంతా మన పిల్లలే, నా శిష్యులందరూ మన బిడ్డలేనే!' అని గంభీరంగ పలుకుతున్నప్పుడు ఎదురు చెప్పే ధైర్యం లేని లక్ష్మమ్మ బాధనంతా గొంతుకలో దిగమింగుకుని 'నా బాధ మీకు అర్ధంగాదు. కన్నకడుపు తీపి పరాయి పిల్లల మీద ఉంటుందా? మీరు కరగలేని, కరుడు మనసు కలవారు.నా ఆవేదన మీరు తెలుసుకోలేరు' అని కృళ్ళికృళ్ళి ఏడ్చింది

మంచులా బిగుసుకున్నారేగాని ఆవంతైనా కరగలేదు మేష్టారు. భార్యదగ్గర ఎన్నడూ కొడుకు ప్రస్తావన తేలేదు. ఆ నోట ఆ నోట వాళ్లను గురించిన వార్తలు వింటున్నా ఆయనలో మార్పు రాలేదు. మనమడు పుట్టేడన్న.వార్త వినికూడా ఆయన నిర్లిప్తతగావే వుండిపోవడం లక్ష్మమ్మకి కత్తిపోటుకంటే ఎక్కువే అయింది 'ఈయన మనిషికాదు. రాయి' అనుకున్నది. స్కూలు పిల్లలు— కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకోవటం, నోట్సులు రాసుకోవటం— అంతే ఆ ప్రవాహంలో కొట్టుకుపోతు ఒకచోట తక్కున ఆగిపోయేరు. అదే ఆయన 'రిటైర్' అవడం. ఒక్కసారి నడుం విరిగినట్టు విల విల లాడిపోయేరు. ఎక్కడలేని తీరుబడి 'ఏం తోచదు. ఒంటరితనం. బాపురు మంటున్న ఇంట్లో, మట్టిబొమ్మలా తనూ, భార్య!

ఎదురింట్లో కలకల లాడుతూ కొడుకులు కోడలు మనమలు, తమని వెక్కిరిస్తున్నట్టు, జాలిపడుతున్నట్టు.

'తాతయ్యా, పద్యాలు చాలుగాని వేపమండ విరు. ముఖం కడుక్కుందాం. బామ్మ అప్పుడే మజ్జిగ చేసేస్తోంది '

'ఓరి పిడుగా! నీ దృష్టి అంతా అటే వుందిరా?' ఒడిలోనుంచి పరిగెట్టిపోతున్న మనమణ్ణి చూస్తూ నెరసిన మీసాలు ఊగుండేటట్టు నవ్వుతున్న తాతయ్యని చూసి రంగనాథం మేష్టారు క్షణం పాటు మరిచిపోయేరు.

'చెంబు నీళ్ళు అరుగుమీద పెట్టేను. ముఖం కడుక్కోండి కాఫీ త్రాగుదురుగాని' గుమ్మం దగ్గరనుంచి కేకేసి వంటింట్లోకి వెళ్లిపోయింది. యంత్రంలా దినచర్యలన్నీ చేసుకోవటం అలవాటైపోయిన లక్ష్మమ్మని అలా చూస్తూ మొదటిసారిగ బాధపడ్డారు

'సీతారామమ్మగా మనమడి ముద్దుముచ్చట్లకి, అల్లర్లకి నోచుకోలేదు 'అత్తయ్యా' అనే పిలుపుకి దూరమైంది. మరబొమ్మలా ఆ వంటింట్లో పనులు చేసుకోవటమేగాని 'మీరుండండి ఆ పని నేను చేస్తాను' అనే కోడలి ఆదరణకి కరువైందిగదా! తను మాత్రం? ఇంతకాలం స్కూలు పిల్లలు, తోడిపంతుళ్ళు, ఇన్స్పెక్షన్లు ఈ గొడవలతో కాలమే తెలియలేదు. ఇప్పుడో తన అవసరం తీరింది, అందరికీ! ఏమిటో వెలితి—బాధ, ఒంటరితనం' 'తాతయ్యా' అనే మనమడు వుండీ లేనట్టు చేసుకున్నాను రఘు ఈడే కాబోలు వాడికీ! వాడు ఇలాగే తెల్లవారకట్ల లేచి వాళ్లమ్మ నాన్నని తాతయ్యా పద్యాలు చెప్పమంటాడేమో? ఆ ముసలాడు సరిగా చెప్తాడా? ఏదో ఆఫీసులో పనిట. ఎంతైనా పంతులు చెప్పినట్టు చెప్పగలడా? అపస్వరాలు చెప్తే... తల్చుకుంటేనే ప్రాణం గిలగిల లాడుతోంది. తను ఎంతమందికి విద్యాదానం చేయలేదూ? స్వంత మనమడిని ఒడిలో కూర్చోబెట్టుకుని మనసారా ఆనందిస్తూ తన విద్యాధనాన్నంతా ఇవ్వలేకపోతున్నాను. ఊహూ వీల్లేదు వాడిని అలా వదిలివేయలేను. తాతయ్యా అనిపించుకుని ఒక్కసారి వీపుమీద ఎక్కించుకోవాలి...' 'అదేమిటీ అలా కూర్చున్నారు? మనసు బాగాలేదా? ఆ నీళ్లేమిటీ కళ్లకి?' కాఫీ గ్లాసు అందిస్తూ పీటమీద దిగాలుగా కూర్చున్న భర్తని చూసి విస్తుపోయింది.

'ఆ!...అహ...ఆ ఏంలేదు. మా స్నేహితుడు గుర్తుకొచ్చేడు, అంతే! సరేగాని ఇవాళ సాయంత్రం బస్సులో వెళ్లి రేపు సాయంత్రానికి వచ్చేస్తాను ఉండగలవా? లేకపోతే వాళ్ల రఘును వాడి చెల్లిని రేపంతా మనింట్లోనే వుంచుకో.' పంచకొసతో కళ్ల నీళ్లు తుడుచుకుంటు కంగారుగ అన్నారు మేష్టారు.

'సరిపోయింది. వాళ్లు మనింట్లో వుంటారా? రఘుకి తాత పక్కలోగాని నిద్రే పట్టదు. వాడి చెల్లికి బామ్మ చంకగాని పనికిరాదు. ఆ చంటిపిల్లమటుకు ఇంకా వాళ్లమ్మదగ్గరుంటుందిగాని కొన్నాళ్లయితే అదీ తాత వీపో బామ్మ మెడో పట్టుకోదూ? సరేలెండి నే నెలాగో వుంటాను. పగలంతా ఒంటరిగ వుండటం ఎలాగు అలవాటే! రాత్రి ఏదో రామ స్మరణ చేసుకుంటా లేదా పనిమనిషి రంగమ్మని పిలిపించుకుంటాను.'

మేష్టారు మరేం మాట్లాడలేకపోయారు.

* * *

'అమ్మాయి తలుపు తీయమ్మా'

ఎడ్రసు తెలుసుకుని ఇల్లు వెదకి పట్టుకుని తలుపుమీద చేయి వేయబోయేటప్పుడు చేయి వణికింది కాళ్లు వణికేయి, ఏదో చేయరాని పని చేస్తున్నట్టు గుండె వేగం హెచ్చింది. వెనుదిరిగి 'వెళ్లిపోదామా' అనుకున్నారు. ఎన్నడు ముఖమైనా చూడని కోడలిని ఎలా పలకరించాలా అనుకున్నారు. నిరసనగ చూస్తుందేమో? ఈసడిస్తుందేమో?...కాదేమో నేను మాత్రం వాళ్ల కోసం వచ్చానా? ఆ పసివాడికోసం వచ్చాను చూస్తాను వెళ్లిపోతాను. వీలైతే వెంట తీసుకెళ్లిపోతాను. ఆ! అంతే!! వాళ్లతో నాకేం పని? గుండె చిక్కపట్టుకుని బింకంగ మెట్లెక్కి గంభీరంగ తలుపు తట్టేరు.

'ఎవరూ?' తలుపు తెరచి 'ఎవరికోసం?' అన్నది రాధ. అపరిచితవ్యక్తిని పరిశీలిస్తూ.

'నేను...నేను.. ప్రసాదు ఇల్లు ఇదేనా?' ఎంత బిగుసుకున్నప్పటికీ రాధ ముఖం చూడగానే కంగారు పడక తప్పలేదు మేష్టారుకి.

'ఆ ఇదే మీరు ఏం పనిమీద వచ్చారో ఈ రాత్రిపూట? వారు కాంపు వెళ్లారు. రేపుగాని రారు...ఆఫీసు పనిమీద వచ్చారా

మూలశంకకు
త్వరగా
సమ్యకమైన
హెడెన్సా
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరముండదు!
DOL 327 TEL

వెలువడింది! వెలువడింది!

'పూర్వసంధ్యా ప్రవర్తతే'

రచన. "తేజోవతి" రు. 6/-

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 'ఉగాది నవలల పోటీ'లో ద్వితీయ బహుమతి పొందిన నవల ముందుగా M O పంపిన వారికి మాత్రం, పోస్టేజి వుచితంగా, పుస్తకము పంపబడును 6 కాపీలకు మించి ఆర్డరిచ్చినవారికి 25% కమీషను ఇవ్వబడును వి పి పద్ధతి లేదు.

వాహినీ పబ్లిషింగ్ హౌస్,
గవర్నరుపేట, విజయవాడ-2

NAINV

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్

రు 255/ విలువగల 'ఎన్‌కార్డ్' 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలకు



రు 25/- వంతున వాయిదలపై చెల్లించి పొందండి మిలిటరీ పర్సనల్స్‌కు ప్రత్యేకమైన తగ్గింపు గలదు నేడే వ్రాయండి.

JAPAN AGENCIES, (AP 77)
Post B.x 1194 Delhi-6.

మంచు కరిగిన వేళ...

మీారు?'

ప్రసాదుకోసం చాలామంది వచ్చిపోతూ వుంటారు ఆఫీసు పనిమీద. ఆ బాపతేమో అనుకున్నది. అయితే చేతిలో సంచీ అదీ చూసి, సంశయంతోనే అడిగింది.

కలుక్కుమన్నది మేష్టారి హృదయం 'తాను ఆఫీసు పనిమీద వచ్చిన పరాయి వాడా?' అంతలోనే సర్దుకున్నారు. అబ్బాయి వూళ్లో లేడని తెలుసుకుని అంతరంలో ఏదో తృప్తి ననుభవించారు. వాడి కళ్ల పడకుండా పోవచ్చునని!

'కాదమ్మాయి నేను ప్రసాదుకి పెద్ద తండ్రిని ఏదీ రాకపోకలు లేకపోవడంనుంచి నేను నీకు తెలియదు. ఏమిటో బంధుత్వాలు మరుగునపడిపోతే కన్నవాళ్లే గుర్తు తెలియదు. ఏదో ఊళ్లోపనుండి వచ్చాను. చూసిపోదామని...'

'అయ్యో! అలాగా!! ఎంత మంచిరోజు రండి మామగారు లోపలికి రండి ఎన్నడూ చూడలేదు కదూ అందుకని ఎరగను క్షమించండి మనసు చిన్నబుచ్చుకున్నారేమో? లోపలికి రండి ఆ సంచీ ఇలా యివ్వండి కాళ్లు కడుక్కోండి. వంట తయారుగానే వున్నది భోజనం చేద్దురుగాని.' ఆప్యాయం వేడికోలు, మన్నన అన్నీ మిళితమైన రాధ ముఖం చూసి చకితులయారు అత్తవారి వైపు బంధువులు వస్తే ఇంత సంబర పడిపోయే కోడలని ఎప్పుడూ ఊహించలేదు అందునా ఎన్నడూ రాకపోకలు లేక పట్టు దలతో వున్నప్పుడు ఇలా ఏనుగెక్కినంత సంబరంగా హడావిడిపడుతున్న రాధని చూస్తే నిజంగానే ఆయన కడుపు నిండిపోయింది లోపలికి వచ్చి ముచ్చటగావున్న ఇల్లు కళకళ లాడే కోడలి ముఖం చూసి మురిసిపోయేరు రంగనాధంగారు నలుమూలలా కలియ చూసి చటుక్కున అడిగేరు.

'అవును గాని బాబు ఏడమ్మా కనిపించడేం? పేరేమిటీ?' 'వాడు ప్రయివేటుకు వెళ్లాడు మామగారూ. ఈపాటికి వచ్చేస్తు వుండాలి ప్రక్క సందులోనే ఏమిటో ఆయనకి తీరుబడి వుండదు నా దగ్గర వీడికి భయం లేదు. అందుకని వాడిని ఇలా పరాయివాళ్ల దగ్గరకి ప్రయివేటుకి పంపించాల్సి వస్తోంది. వాళ్ల తాతగారి పేరే రంగనాధం!'

'తాతగారి పేరు రంగనాధం!' మనసులో గొణుక్కున్నారు ఆనందం ఉబికిపోతోంది. 'అలాగ!' అనటం తప్ప మరేమి మాట్లాడ లేకపోతున్నారు.

'అవును మామగారూ. ఏమిటో పట్టు దలలకి అర్థం వుండదు. మా పెళ్లి మూలంగా అటు కన్నవారికి ఇటు అత్త వారికి దూరమై అనురాగాలు, ఆదరాలు అన్న పదాలే మర్చిపోయాము. లేకపోతే వాడు అలా పరాయివాళ్ల దగ్గర చదువుకునే ఖర్మేమిటి చెప్పండి? తాతగారి విద్య ఎందరిని ఉద్ధరించలేదూ? స్వంత మనుమడై వుండి వీడు ఇలా పాకులాడవలసి వచ్చింది. ఆయనకి ఎన్నోసార్లు చెప్పాను మీరేనా పట్టుదల వదలి అత్తయ్య మామయ్యని తీసుకురండని. ఆయన వింటుంటేనా? నాన్నకి లేని ప్రేమ నాకెందుకుండాలీ అంటారు? కాని నాకు తెలుసు మామ గారూ—స్త్రీ హృదయం ఎంత క్షోభిస్తుందో అత్తయ్య ఎంత పరితపిస్తున్నారో ...నేను వెళ్లి తీసుకునివద్దామనుకున్నాను ఆయన ఒప్పుకోలేదు! పోనీ మా అమ్మనేనా చూసివస్తానంటే... మీా నాన్న కోసం తగ్గి వచ్చి తీసుకెళితే వెళ్దుగాని అంతేగాని నీ అంతట నీవు వెళ్తే నే సహించను... అంటారు...' కళ్లొత్తుకుంటున్న రాధని చూస్తూంటే రంగనాధంగారి మనసు ఆర్ద్రమైపోయింది ఇంతకాలం పుట్టింటి వారి మద్దతు వుందనుకున్నాను గాని కొడుకు కోడలు దిక్కులేని పక్షుల్లా వున్నట్టు తెలియదు ఎంత ప్రారబ్ధం!

'అమ్మాయి నిజంగ మా వాడు...అదే మా తమ్ముడు ఎంత కఠినుడమ్మా? కొడుకు తన మాట వినలేదని పట్టుదలేగాని ముందు చూపులేని మనిషి. వట్టి మంకుపట్టు! మతిలేని మనిషా అని మతిలేని మనిషి!! భార్యని ఏడిపిస్తూ కొడుకు కోడలకి దూరమై ఏం బావుకు చద్దామని? ఏళ్లు రాగావే సరా?...'

'మామగారూ!...వద్దు అంతలేసి మాట లనకండి ఎంతైనా ఆయన మాకు పూజ్యులు" తండ్రిలాంటి వారు. ఏదో మా అదృష్టం ఇంతే అనుకుంటాము. ఇన్నాళ్ళకి రాకరాక వచ్చిన మిమ్మల్ని ఇలా కలత పెడుతున్నాను పాపిష్టిదాన్ని. లేవండి

మంచు కరిగిన వేళ...

భోజనం చేద్దురు గాని. అదుగో రంగడు వచ్చేసేడు. ఇద్దరికి వడ్డించేస్తాను.'

'అమ్మా! మరేం.. మరేం . అంటూ వచ్చేస్తూ ఆగి 'ఎవరమ్మా ఈ తాతగారు?' అన్నాడు కళ్ళు చిట్లించి ఎక్కడా చూడ లేదే? అన్నట్టుగ. తనకు తెలుసున్న తాతల జాబితాలో ఈ తాత లేడే! కోమటికొట్టు గవరన్న తాత, — బడితోటమాలి వీరన్నతాత, ఇంకా పక్కమేడలో కాపురమున్న సీతాయ్ వాళ్ళ ముక్కుపొడుం తాత, కూరగాయలు అమ్మే కోటయ్య తాత ఇంకా పోతే వేరు సెనక్కాయలమ్మే పాపన్న తాత - అప్పు డప్పుడు వచ్చే తత్వాలు పాడే తంబురతాత .. మరి ఈ తాత ఎవరబ్బా? దర్జాగ కుర్చీలో కూర్చున్నాడు అచ్చం బడిలో మేష్టారిలాగ...' ఆ చిన్నబుర్రలో జవాబు దొరకలేదు.

'ఈ తాతగారు మన తాతగారే బాబు. అంటే మీ నాన్నగారికి పెద్ద నాన్న గారు'—అన్నది లత కళ్ళనిండా వెలుగు నింపుకుని తనయుడివైపు చూస్తూ.

'రా బాబూ' రెండు చేతులుచాచి ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూస్తున్నట్టు, నాచిపోయి వున్నట్టు ఆశగ పిలిచారు రంగనాథంగారు. 'తాతగారూ' అంటూ ఆయన దగ్గరగవెళ్ళి 'అయితే మా తాతగారు మీకు తమ్ముడా? ఆయన్నిక్కడికి తీసుకురండి లేకపోతే మనమే వెళ్దాం పదండి. మా నాన్నగారు వూరికి వెళ్ళారుగా త్వరగ వెళ్ళివచ్చేద్దాం...'

మేష్టారి కళ్ళు అశ్రుపూరితాలయి కంఠం గద్గదమైపోతోంది. 'అచ్చు అవే కళ్ళు అదే ముక్కు. అచ్చు గుద్దినట్టు ప్రసాదు పోలికే! నాయనా ప్రసాదు ఎన్నా ళ్ళయిందిరా నిన్ను చూసి...' వళ్ళు తెలియనంత గాఢంగ కౌగలించుకున్నారు మనమణ్ణి.

* • *

వదన్న కోలది దగ్గర కూర్చుని కొసిరి కొసిరి తినిపించిన కోడలి చేతి భోజనం — ఉత్సాహంగ స్కూలు విషయాలు చెప్తు పంక్తిని కూర్చున్న మనమడి ముద్దు మాటలు, రంగనాథంగార్ని ఉబ్బించేసు న్నాయి. తను కొన్నివందలమంది పిల్లలకి విద్య ధారపోసేరు. అందులో కొంతమంది తనకంతో అభిమాన పాత్రులు అయారు. కాని...కాని...రంగడు కొన్ని గంటల పమ

యంలోనే ఇంత చేరువయ్యాడు. వీడి తర్వాతే మిగతావాళ్లంతా, ఈ మమత చెప్పలేనిది! ఆనాడు 'లక్ష్మి' అందుకే ఏడ్చింది. నాకు అర్థం కాదన్నది కాని అర్థమయింది. ఈ తీపిని వర్ణించేశక్తి నా సర్వీసులో ఆర్జించలేకపోయేను. వీడిని వదలి ఎలా వెళ్లగలను?' పక్కలో పడుకున్న రంగడి బుగ్గ మృదువుగ నిమిరారు, తెల్లవారగట్ల మెలుకువ వచ్చిన మేష్టారు. ఆయనకి — అరుగుమీద తాతయ్య వడిలో కూర్చున్న రఘు మెదిలాడు.

ఆ రోజంతా తాత మనమలు బజారంతా తిరిగేరు. రంగడిని బడి మానిపించి మరీ త్రిప్పారు రంగనాథం మేష్టారు. పుస్తకాలు, బొమ్మలు, కొన్నారు. చీర రవికల గుడ్డ కొని పూలు పొట్లం కట్టించి ఇంటికి చేరేరు.

'ఎందుకు మామగారూ ఇవన్నీ?' అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టారని నొచ్చుకున్నది రాధ.

'ఫర్వాలేదు అలా అనకమ్మా నేనే మీ మామగార్ని అయితే అలా అందువా? ఏదో నా ఆనందం! మళ్లీ సాయంత్రం వెళ్లిపోవాలి చీర కట్టుకో తల్లీ చూస్తాను.'

మంచు కరిగిన వేళ...

అన్నారు హృదయమంతా నిండిన ఆనందంతో.

రాధ చీరకట్టుకుని మామగార్కి నమస్కరించింది. 'దీర్ఘ సుమంగళీభవ. మీ రేళ్లు మీ దంపతులు, బాబు సుఖంగ వర్ధిల్లండి' తలమీద చేయివేసి మరీ దీవించారు 'మామగారూ, మీరు ఆయన వచ్చే దాక వుండండి. అసలు ఆయన కోప్పడు తారు గూడాను.' రాధ అన్నది 'అవును తాతయ్యా నువ్వు ఇప్పుడు వెళ్లడానికి వీల్లేదు' బాబు వంత పాడేడు. మేష్టారుకి వుండాలని అసలు అక్కడే వుండిపోవాలని... వున్నది కాని అవతల 'లక్ష్మి' ఒంటరిగ వుంది! అదీగాక ప్రసాదు తనని చూస్తే ...కోడలికి తెలిస్తే... 'ఊహూ ఇప్పుడు కాదమ్మా మళ్లా వస్తాలే' బాబుని వదల్లేక వెళ్లారు.

*   *   *

'ఇదేమిటే ఈ చీర ఎప్పుడు కొన్నావు? నాకు తెలియని కొత్త చీర నీ కెక్కడిది?' ఇంట్లోకి రాగానే కొత్త చీరతో కనిపించిన లక్ష్మమ్మని చూస్తూ వింతగ అడిగేరు మేష్టారు.

'అవును ఈ చీర మీకు తెలియనిదే అంతే కాదు దీని విలువా మీకు తెలియదు. భగవంతుడికి ఇన్నాళ్లకి నా మీద దయ గల్గింది మీరు నిన్న వూరికి వెళ్లగానే అబ్బాయి వచ్చాడు నా తండ్రి నన్ను చూసి ఎంత సంతోషపడ్డాడనీ? కడుపార భోజనం తిని అమ్మా ఎప్పుడూ ఇలాగే నువ్వు నాకు దగ్గర కూర్చుని తినిపిస్తూ వుండాలమ్మా భగవంతుణ్ణి అలాగా ప్రార్థిస్తానమ్మా. అన్నాడు నా బంగారు నాయన! కొత్త చీర కొంగుతో కళ్లు వత్తుకున్నది.

'ఆ!??— అబ్బాయి కొంప వెళ్లలేదా? నాలాగే వాడుకూడా?.' ఆశ్చర్యంలో మునిగి స్వగతంతో అనుకోవలసిన మాటయి పైకే అనేసేరు.

'ఏమిటే మీరనేది?! మీరు స్నేహితుణ్ణి చూడ్డానికి వెళ్లలేదా?' లక్ష్మమ్మ ప్రశ్నకి జవాబు చెప్పకుండ ముఖమంతా ఆనందం పులుముకున్నట్టు నంచున్నారు. ఎప్పుడూ గంభీరంగ ఊపిరి బిగుసుకునేట్టు వుండే రంగనాథం మేష్టారు; ఇంతకాలం అజ్ఞాతవాసం చేసినట్టు ఇక పైన చేయలేనట్టు అంతరంలో దాగిన మమత మాత్రం పెదాలచాటున ముసిముసిగ నవ్వింది.